సాక్షి మంచిర్యాల

సోమవారం । 27 । మే । 2024



రైతులూ జాగ్రత్త..! 8లో▸

మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. నకిలీ విత్తనాలు మార్కెట్లకు చేరుతున్నాయి. రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



ఎస్‌డీఎల్.. బ్రేక్‌డౌన్!

సింగరేణి భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర వహించే ఎస్‌డీఎల్ యంత్రాలు బ్రేక్‌డౌన్ అవుతున్నాయి. స్పేర్స్ పార్ట్స్ కొరతతో తరచూ మొరాయిస్తున్నాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
44.4 /32.4

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

ఇక.. ఆరోగ్య మందిర్‌లు!

- పల్లె దవాఖానాలను మార్చుతున్న కేంద్రం
- 12 రకాల వైద్యసేవలు అందించేలా ఏర్పాట్లు
- మెరుగు పడనున్న గ్రామీణ వైద్య సేవలు



పల్లె దవాఖానాలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మార్చిన దృశ్యం

మంచిర్యాలటౌన్: పల్లె ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడంపై కేంద్రం దృష్టిసారించింది. ఈ క్రమంలో పల్లె దవాఖానాలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మార్చింది. వీటిలో 12 రకాల వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. దీంతో గ్రామీణ వైద్యం మరింత మెరుగుపడనుంది. మెరుగైన వైద్యసేవలు పల్లె ప్రజలకు అందనున్నాయి.

సబ్ సెంటర్లు.. పల్లె దవాఖానాలుగా..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నడిచే సబ్ సెంటర్లను గతంలో పల్లె దవాఖానాలుగా మార్చి వైద్య సేవలను గ్రామీణుల చెంతకే తీసుకెళ్లారు. ప్రస్తుతం వాటిని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లుగా మార్చి వైద్య సేవలను మరింత మెరుగుపర్చనుంది. 12 రకాల వైద్య సేవలను ఆయా కేంద్రాల్లో అందించేలా వైద్యులకు నిపుణుల ద్వారా శిక్షణ అందించారు. జిల్లాలో పల్లె దవాఖానాలు 149 ఉండగా, అందులో 100 దవాఖానాలను ఇప్పటికే ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మార్చారు. విడతల వారీగా మిగతా వాటిని మార్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

అదనపు సేవలు

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఎంబీబీఎస్ చదివిన వైద్యుడితోపాటు, ఒక స్టాఫ్ నర్సును కూడా నియమించి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే వీటిలో మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, అంటు వ్యాధుల నియంత్రణ, సాధారణ వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. అసంక్రమిత వ్యాధుల బారిన పడిన వారికి మాత్రలు పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు మరిన్ని అదనపు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గర్భిణి, ప్రసవ సేవలు, నవజాత శిశు, శిశు ఆరోగ్య సేవలు, బాల్య, కిశోర శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక, పునరుత్పత్తి ఆరోగ్య సేవలు, సంక్రమిత వ్యాధుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, సాధారణ సంక్రమిత వ్యాధుల నిర్వహణ, సాధారణ రుగ్మతలకు ఔట్ పేషెంట్ సేవలు, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, నివారణ, నియంత్రణ, నిర్వహణ, ఉపశమన, వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, సాధారణ కంటి, ఈఎన్‌టీ సేవలు, సాధారణ నోటి ఆరోగ్య సంరక్షణ, అత్యవసర వైద్య సేవలు, మానసిక ఆరోగ్య సమస్యల స్క్రీనింగ్, నిర్వహణ సేవలు అందించనున్నారు.

అవసరాన్ని బట్టి రెఫర్

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు, వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పత్రుల్లోని పలు విభాగాల వైద్యులు నెలలో రెండు రోజులు ఆరోగ్య మందిర్‌లను సందర్శించి వైద్య సేవలు అందిస్తారు. మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేటలోని వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు లేదా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రెఫర్ చేసి వైద్య సేవలు అందేలా చూస్తారు. వీటితోపాటు, మానసిక రోగులకు వైద్యం, ఫిజియోథెరపీ సేవలను అందించేలా నెలలో ఒకసారి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వైద్యులు వెళ్లేలా చర్యలు తీసుకోనున్నారు. అదనపు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలతోపాటు, కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే అందుబాటులోకి తేనున్నారు.



ఆరోగ్య మందిర్‌లో అందించే వైద్య సేవల వివరాలు

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల వివరాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	17
అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	4
బస్తీ దవాఖానాలు	4
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	3
పల్లె దవాఖానాలు	149
ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌గా మార్చినవి	100

పల్లె ప్రజలకు పూర్తి వైద్యం



ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లుగా పల్లె దవాఖానాలను మార్చడంతోపాటు, వైద్య సేవలను విస్తరించడం ద్వారా పల్లె ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందుతుంది. 12 రకాల వైద్య సేవలను అందించేందుకు వైద్యుడికి, ఎంఎల్‌పిహెచ్‌ఎస్‌లకు రెండు రోజులు నిపుణులైన వైద్యులతో శిక్షణ అందించాం. వైద్య సేవలకు అవసరమైన సామగ్రిని ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసి, సేవలను ప్రజలకు చేరువ చేస్తాం.

– డాక్టర్ అనిత, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి

అటు మద్యం.. ఇటు దేశీదారు..!



ఇటీవల కోటపల్లి అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద పట్టుబడిన దేశీదారు

- మన మద్యానికి 'మహా' డిమాండ్
- సరిహద్దు జిల్లాలకు అక్రమ రవాణా
- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

మంచిర్యాలక్రైం: మన మద్యం హద్దులు దాటుతోంది. మహారాష్ట్రకు అక్రమంగా తరలిపోతోంది. మన సరిహద్దులో ఉన్న జిల్లాలో మద్య నిషేధం అమలులో ఉండడంతో వ్యాపారులు అక్రమంగా మన మద్యం తరలించుకుపోయి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇదే సమయంలో మహారాష్ట్ర దేశీదారు కూడా మన జిల్లాలో ఏరులై పారుతోంది. మన మద్యం ధరలతో పోలిస్తే దేశీదారు తక్కువ ధరకు లభిస్తుండడంతో గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యంతోనే మద్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

'మహా' డిమాండ్..

తెలంగాణ సరిహద్దున ఉన్న మహారాష్ట్ర జిల్లాల్లో మద్యనిషేధం అమలులో ఉంది. దీంతో అక్కడ దేశీదారు అమ్మకాలు జోరుగా సాగుతుంటాయి. ఈ నేపథ్యంలో మన మద్యానికి అక్కడ డిమాండ్ ఎక్కువ. అక్కడి వ్యాపారులు తెలంగాణ మద్యాన్ని మహారాష్ట్రకు తరలించుకుపోయి ఎమ్మార్పీ కన్నా రూ.10 నుంచి రూ.20 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. చాలా మంది దీనిని వృత్తిగా మార్చుకున్నారు. ఇక మహారాష్ట్రలో దేశీదారుతోపాటు సంత్ర, బింగిరి వంటి రకాల మద్యం అమ్మకాలు ఎక్కువ. వాటి ధర మన మద్యం ధరలతో పోల్చుకుంటే తక్కువ. దేశీదారు క్వార్టర్ ధర రూ.80 ఉండగా జిల్లాలో రూ.90కి విక్రయిస్తున్నారు. మన చీఫ్ లిక్కర్ ధర రూ.110 ఉంది. బెల్టు షాపుల్లో మరో రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ కారణంగా కూడా మందుబాబులు చాలా మంది దేశీదారు కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా జిల్లాలో మద్యం అమ్మకాలు తగ్గుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

రైలు మార్గం ద్వారా రవాణా..

జిల్లాకు సరిహద్దు ప్రాంతమైన ప్రాణహిత తీరం నుంచి, గడిచిరోలి జిల్లా సిరొంచ మీదుగా, బల్లార్షా వైపు నుంచి రైలుమార్గం ద్వారా జిల్లాకు దేశీదారు అక్రమ రవాణా సాగుతోంది. మహారాష్ట్రలోని చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాల నుంచి కోటపల్లి, ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట, కోటపెల్లి, అర్జున్‌గుట్ట ప్రాణహిత సరిహద్దు, గ్రామీణ ప్రాంతాల మీదుగా కూడా జిల్లాకు దేశీదారు రవాణా జరుగుతోంది. మన మద్యాన్ని సిరొంచలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు మీదుగా మంచిర్యాల, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లికి చెందిన వ్యాపారులు మహారాష్ట్రకు తరలించుకుపోతున్నారు.

పట్టుబడుతున్నా ఆగని దందా..

మద్యం, దేశీదారు అక్రమ రవాణాను అప్పుడప్పుడు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు అడ్డుకుంటున్నారు. తనిఖీల్లో పట్టుకుంటున్నారు. కేసులు నమోదు చేస్తున్నారు. అయినా వ్యాపారులు ఈ దందా వీడడం లేదు. ఏప్రిల్ 27న మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు టాటా ఏస్ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రూ.2 లక్షల విలువైన మద్యాన్ని భీమారం పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కోటపెల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన మహ్మద్ షరీఫ్, తిప్పని రామయ్యను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఏప్రిల్ 23న మహారాష్ట్ర చంద్రపూర్ నుంచి మంచిర్యాలకు అండమాన్ రైలులో దేశీదారు తరలిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక సీఐ బన్సీలాల్ రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో నిఘా ఏర్పాటు చేశారు. తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని తనిఖీలు చేయగా 9 కాటన్ల దేశీదారు బాటిళ్లు లభించాయి. ఈమేరకు సిరొంచకు చెందిన కొమ్మెరి తిరుమల్, జాడి రాజేశ్, జాడి రహుల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అక్రమ దందాపై ఫోకస్..



జిల్లాలో మద్యం అక్రమ దందాపై ఫోకస్ పెట్టాం. టాస్క్‌ఫోర్స్ టీమ్ ఏర్పాటు చేశాం. మన మద్యం గతంలో మహారాష్ట్రకు వెళ్లేది. ఇప్పుడు వెళ్లడంలేదు. దేశీదారు చంద్రాపూర్ నుంచి రైలు మార్గంలో జిల్లాకు చేరుతోంది. దేశీదారు అమ్మకాలపైనా దృష్టి పెట్టాం. ఎవరైనా అమ్మితే సమాచారం ఇవ్వాలి. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– కేజీ.నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ అధికారి

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌పీసీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన బొడ్డు శంకర్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో హాజీపూర్ ఆహార ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కర్ణమామిడి, కొండపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఆహార ఉత్పత్తి సంస్థ డైరెక్టర్ పూస్కూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతీ రైతు తమ అవసరాల కోసం 10 నుంచి 20 గుంటల వరకు సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరల సాగు చేసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు సహాయం అందిస్తామని తెలిపారు. ఆవు మూత్రం, ఆవు పేడ అందిస్తానని చెప్పారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కలిపించి ఎఫ్‌పీసీ ద్వారా కొనుగోలు చేస్తామని ఎఫ్‌పీసీ డైరెక్టర్ బొడ్డు శంకర్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు కొట్టె రవీందర్, బన్న శేఖర్, బొడ్డు భూమన్న, ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ఏర్పాటుకు వినతి



వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసేలా సహకరించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్‌బాషాకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వల కొరత ఉన్నందున బెటాలియన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ద్వారా పలువురికి ప్రాణదాతలుగా నిలిచిన వారవుతారని కోరారు. స్పందించిన కమాండెంట్ త్వరలోనే బెటాలియన్ మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామని, తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు, రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్, అనాథ ఆశ్రమం ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పని ఎక్కువ.. వేతనం తక్కువ!



సమ్మెలో భాగంగా మంచిర్యాలలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు(ఫైల్)

- సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆవేదన..
- పోరాటం చేస్తున్నా దక్కని ఫలితం..

దండేపల్లి: సమగ్ర శిక్ష అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఉద్యోగులు పనిభారంతో సతమతమవుతున్నారు. పనికి తగ్గ వేతనం రాక ఆవేదన చెందుతున్నారు. తమను రెగ్యులర్ చేయాలని ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తమను పర్మినెంట్ చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో..

సమగ్రశిక్షా అభియాన్‌లో జిల్లాలో 398 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మండల విద్యావనరుల కేంద్రాల్లో ఎంఐఎస్ 16 మంది. సీసీవోలు 16 మంది, మెసెంజర్స్ 11 మంది, సీఆర్పీలు 42 మంది, భవిత కేంద్రాల్లో పనిచేసే ఐఈఆర్పీలు 29 మంది, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎస్‌వోలు 18, పీజీ సీఆర్టీలు 58, సీఆర్టీలు 129, పీఈటీలు 18, అకౌంటెంట్స్19, ఏఎన్‌ఎంలు 19, ఆఫీస్ అటెండర్లు 19, కేర్‌టేకర్లు 4 పనిచేస్తున్నారు.

15 ఏళ్ల క్రితం నియామకం..

గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది కొరతతో ఉపాధ్యాయులు బోధనతోపాటు, బోధనేతర పనులు కూడా చేయాల్సి వచ్చేది. విద్యాహక్కు చట్టం వచ్చిన తర్వాత ఉపాధ్యాయులు బోధనకే పరిమితమయ్యారు. దీంతో 2008లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో సమగ్ర శిక్షాభియాన్ ప్రాజెక్టు అమల్లోకి వచ్చింది. 60 శాతం నిధులు కేంద్రం, 40 శాతం నిధులు రాష్ట్రం భరించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల మంది ఉద్యోగులను తీసుకున్నారు. జిల్లాలో 398 మంది పనిచేస్తున్నారు. తమను రెగ్యులర్ చేయాలని ఐదేళ్లుగా పోరాటం చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో 24 రోజుల సమ్మె చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకన్నా ఎక్కువగా పని భారం ఉన్నప్పటికీ వేతనం మాత్రం తక్కువగా ఉందని వాపోతున్నారు. రోస్టర్ రూల్‌ఆఫ్ రిజర్వేషన్ రాతపరీక్ష, ఇంటర్వ్యూ, మెరిట్ ఆధారంగా ఎంపికయిన తాము కనీస వేతనం, ఉద్యోగ భద్రతకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో తమ సమస్య పరిష్కరిస్తానని గతంలో టీపీసీసీ హోదాలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు తమను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు.

అన్ని విభాగాల్లో కీలకం..

విద్యాశాఖలో జిల్లా, మండలస్థాయి పాఠశాలల్లో వివిధ విభాగాల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు విద్యను చేరవేస్తూ, ప్రభుత్వ పథకాల అమలుకు కృషిచేస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, రాగిజావా, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, విద్యార్థులకు కళానైపుణ్యం, వ్యాయామ విద్య, ప్రశ్నపత్రాల పంపిణీ, పరీక్షల నిర్వహణ, మన ఊరు–మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాలల సందర్శన, ఎస్‌ఎంసీ శిక్షణ, ఏకోపాధ్యాయ పాఠశాలల నిర్వహణ, బడీడు పిల్లలను బడిలో చేర్పించడంతోపాటు, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్నారు. ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.


న్యాయం చేయాలి..



సమాన పనికి సమాన వేతనం కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించినా శ్రమదోపిడీకి గురిచేస్తున్నారు. విద్యారంగంలో కీలక పాత్ర పోసిస్తూ నిరంతరం సేవలందిస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలి. టీపీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈమేరకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– ఇప్పు సురేందర్, సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

'వ్యక్తిగత విమర్శలు చేస్తే ఊరుకోం'



మాట్లాడుతున్న రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి

జైపూర్: ఎక్కడో బీజేపీ పార్టీకి ఓట్లు వచ్చాయని ఎన్నికల ఫలితాలు రాకముందే ఎన్నికల్లో గెలిచినట్లు గోమాస శ్రీనివాస్ చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామిపై వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి తప్పుపట్టారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్, నాయకులు శీలం వెంకటేశ్, మంతెన లక్ష్మణ్‌తో కలిసి మాట్లాడారు. వివేక్ వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గానికి, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు గుర్తుకువచ్చే గోమాస శ్రీనివాస్ మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగి టికెట్ కోసం బీజేపీలోకి వెళ్లారన్నారు. ఇప్పుడు వివేక్‌పై వ్యక్తి గత విమర్శలు చేయడం సరికాదన్నారు. మహారాష్ట్రలో దోపిడీ దందాలకు పాల్పడే వ్యక్తి గోమాస అని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సైతం తమ ఉనికి కాపాడుకోవడానికి ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అన్నారు. జిల్లాలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని తెలిపారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యం కూడా కొంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు అంబల్ల రవి, బేద మల్లేశ్, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు ఆసంపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- క్షతగాత్రులకు డీసీసీ అధ్యక్షురాలి భరోసా..



క్షతగాత్రులకు సాయం అందిస్తున్న సురేఖ

దండేపల్లి: మండల కేంద్రం సమీపంలో ఈనెల 17న ట్రాలీవాహనం బోల్తాపడిన ఘటనలో గాయపడిన ఉపాధి కూలీలను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదివారం పరామర్శించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటాం అని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సూచన మేరకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ద్వారా గాయపడ్డ కూలీలకు ఒక్కొకరికీ రూ.10 వేల నగదు, 25 కిలోల బియ్యం, మృతి చెందిన బంగారు మల్లవ్వ కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా వచ్చే బెనిఫిట్స్‌కూడా అందేలా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ నాగరాణి, ఆర్జీపీఎస్ జిల్లా అధ్యక్షుడు త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు లక్ష్మీనారాయణ, లింగన్న, గోపాల్, నవీన్, సత్యం, మురళీ, వెంగల్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త 'సెగ్రిగేషన్'కు చేరేలా..

- షెడ్లను వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం ఆదేశం
- ఇన్నాళ్లు వృథాగా ఉన్న కంపోస్టు పిట్లు
- సేంద్రియ ఎరువు తయారీపై నిర్లక్ష్యం
- జిల్లాలో వినియోగంలోకి రానున్న షెడ్లు



హాజీపూర్‌లో సేంద్రియ ఎరువు తయారీ..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టిన గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలించేలా ట్రాక్టర్లను కొనుగోలు చేసింది. అయితే వినియోగంలో నిర్లక్ష్యం జరిగింది. తాజాగా కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. పారిశుధ్య నిర్వహణ తోపాటు సేంద్రియ ఎరువు తయారీ ద్వారా పంచా యతీల ఆదాయం పెంచాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కమిషనర్ షఫీయు ల్లా ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి తడి, పొడి చెత్త వేర్వేరు చేయడంతోపాటు ఎరువు తయారీకి శ్రీకారం చుట్టనున్నారు.

తడి, పొడి చెత్త సేకరణ..

గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ విధిగా జరిపేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గతంలో అవగాహన కల్పించిన విధంగా ఇప్పటికే ఇంటింటికీ అందజేసిన బుట్టల ద్వారా తడి, పొడి చెత్త వేరుచేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలని ప్రచారం చేసేలా చూస్తున్నారు. మూడేళ్ల క్రితం తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని పల్లెప్రగతి కార్యక్రమాల ద్వారా చైతన్యం చేయడంతోపాటు చెత్త ఆరుబయట వేస్తే జరిమానా విధిస్తామని కూడా హెచ్చరించారు. ఇప్పుడు అదే పద్ధతిని అమలు చేసేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. పారిశుధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో అమలు చేస్తే సీజనల్ వ్యాధులు కూడా దూరమవుతాయని ప్రచారం చేయనున్నారు.

ప్రతీ గ్రామంలో వర్మీ కంపోస్ట్..

ఇంటింటా సేకరించిన తడి, పొడి చెత్తను కాంపోస్ట్ షెడ్లకు తరలించి అక్కడ తడి, పొడి చెత్తగా వేరు చేయించనున్నారు. తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేసేలా ఏర్పాట్లు చేశారు. పారిశుధ్య నిర్వహణ అధికారుల నిరంతర పర్యవేక్షణ చేపడుతుండగా కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది వర్మీకంపోస్ట్ తయారీలో కీలకంగా వ్యవహరించనున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని రెండు పంచాయతీరాజ్ డివిజన్ల పరిధిలోని 16 మండలాల్లో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామ పంచాయతీల్లోనూ కంపోస్ట్ షెడ్లు ఉన్నాయి. వీటిలో 75 డంపింగ్ యార్డులకు నీటి సౌకర్యం, 30 షెడ్లకు విద్యుత్ సౌకర్యం ఉండగా 309 షెడ్లకు ఫెన్సింగ్, బయో ఫెన్సింగ్ చేసి ఉంది. గతంలో జిల్లా వ్యాప్తంగా అన్ని యూనిట్లలో కలిపి దాదాపు 12 టన్నుల కాంపోస్ట్ తయారు చేశారు. స్థానిక అవసరాలకు 5 టన్నులు ఉపయోగించగా కొన్ని పంచాయతీలు వర్మీ కాంపోస్ట్ విక్రయించి ఆదాయం పొందాయి. రీసైక్లింగ్‌కు ఉపయోగపడే పొడి చెత్తను కూడా దాదాపు 50 జీపీలు సుమారుగా 7 టన్నులకు పైగా విక్రయించి ఆదాయం సమకూర్చుకున్నాయి.

కంపోస్ట్ తయారు చేయాల్సిందే..



జిల్లాలోని కాంపోస్ట్ షెడ్లలో వర్మీ కంపోస్ట్ తప్పకుండా తయారు చేసేలా సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాల్సిందే. ఇంటింటా చెత్త సేకరణ విధిగా చేపడుతూ తడి, పొడి చెత్త వేరు చేయడం, తడి చెత్తతో కంపోస్ట్ తయారు చేయాలి. ప్రజలు కూడా చెత్తను ఆరుబయట వేయకుండా సామాజిక బాధ్యతగా పారి శుధ్య నిర్వహణకు సహకరించాలి. తయారైన కంపోస్ట్‌ను డ్రైచేసి గ్రామాల్లో నాటిన మొక్కలకు ఉపయోగించాలి. ఎక్కువ మొ త్తంలో ఉత్పత్తి చేస్తే విక్రయించి పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలి.

– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

క్లుప్తంగా

మామిడి తోట దగ్ధం



కాలిబూడిదైన కంచె కొయ్యలు

నెన్నెల: మండలంలోని గొల్లపల్లిలో గడ్డం మల్లాగౌడ్‌కు చెందిన నాలుగెకరాల మామిడి తోటలో 30 చెట్లు దగ్ధమైంది. కంచె కొయ్యలు కాలిబూడిదయ్యాయి. ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారని బాధిత రైతు కన్నీరు మున్నీరయ్యాడు. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు పేర్కొన్నాడు. గతంలో కొందరు వ్యక్తులు కంచె కొయ్యలను ధ్వంసం చేశారని తెలిపాడు. ఈ మేరకు నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉరివేసుకుని మహిళ అత్మహత్య

కోటపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సర్వాయిపేటకు చెందిన సపటా నారక్క(55) కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఉరివేసుకుంది. ఇంటికి వచ్చిన భర్త బాలయ్యనాయక్ గమనించి ఆమెను కిందకు దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందింది. ఏఎస్సై కాంతారావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి



చుక్కల దుప్పి కళేబరం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కడంబా అటవీ ప్రాంతంలో ఆదివారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిందని ఎఫ్‌ఆర్వో రమాదేవి తెలిపారు. ఆదివారం ఉదయం కడంబా భీమన్న ఆలయం సమీపంలోకి చుక్కల దుప్పి రాగా, అక్కడ ఉన్న కుక్కలు దాడి చేసి హతమార్చినట్లు పేర్కొన్నారు.

కౌటాలలో..



దుప్పి కళేబరం

కౌటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో శనివారం చుక్కల దుప్పి మృతి చెందింది. ఫారెస్ట్ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా పంచనామా చేసి పాతిపెట్టిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్లు అటవీ అధికారులు తెలిపారు. కానీ చుక్కల దుప్పి మృతి వివరాలు గోప్యంగా ఉంచడంపై జంతుప్రేమికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వేటగాళ్ల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిందా.. వీధికుక్కల దాడిలో మృతి చెందిందా అని ప్రశ్నిస్తున్నారు.

రైతులూ జాగ్రత్త..!

- విత్తనాలు, ఎరువులు కొనుగోళ్లలో అప్రమత్తత అవసరం
- కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- గుర్తింపు పొందిన విత్తనమే మేలు

జిల్లాల వారీగా..

జిల్లా	సాగు విస్తీర్ణం
మంచిర్యాల	3.42 లక్షలు
ఆదిలాబాద్	5.56 లక్షలు
నిర్మల్	4.30 లక్షలు
కుమురంభీం ఆసిఫాబాద్	4.80 లక్షలు



బస్తాల్లో పలు కంపెనీల పత్తి విత్తనాల ప్యాకెట్లు

మంచిర్యాలఅగ్రికల్చర్/నేరడిగొండ: మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. విత్తనాలు, ఎరువులు సమాకుర్చుకునే సమయం దగ్గరపడింది. ఈ సమయంలో పలు కంపెనీల విత్తనాల, పురుగుల మందుల ప్రచారం జోరుగా ఊపందుకుంది.పుట్టగుడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్బాటాలు సాగిస్తున్నాయి. కంపెనీల యాజమాన్యాలు ఉమ్మడి జిల్లాలోని డీలర్లకు ప్యాకేజీలు, విదేశీ టూర్ల ఆఫర్ చేస్తున్నాయి. పత్తి విత్తనాలకు సంబంధించిన కంపెనీలు ఆయా గ్రామాల్లో రైతులను ఆకట్టుకునేలా వాహనాల్లో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. మైక్‌సెట్ ద్వారా ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్లకు చేరుతున్నాయి. ఆయా కంపెనీల వలలో రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఆకర్షణీయ ప్రకటనలకు లోనుకావద్దు

ఆయా కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు లోబడి విత్తనాలు కొనుగోలు చేయరాదు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో..గుర్తింపు లేని లేబుల్‌తో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలు రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీలపై విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్ని సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. విత్తన కంపెనీపై ప్రభుత్వ నిబంధనల వివరాలు ఉన్నాయో జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా విత్తనాల్ని ఉత్పత్తి చేసే కంపెనీపై నమ్మకం ఉండాలి.

విత్తనాలు కొనేముందు..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన ఆధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి
- బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో సరి చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనవద్దు.
- విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకు భద్రపర్చాలి
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనే ముందు..

- ఆధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.

నాణ్యమైన విత్తనాలు కొనాలి

ప్రభుత్వ లైసన్స్ కలిగిన డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదు తమ వద్ద పెట్టుకోవాలి. బీటీ–3 పేరిట నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. దళారులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దు.

– సురేఖ, మంచిర్యాల జిల్లా వ్యవసాయ అధికారి

పురుగు మందు కొనే ముందు..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందు కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు.
- వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

కారు ఢీకొని ఉపాధి కూలీ మృతి



లచ్చన్న (ఫైల్)



పంచనామా చేస్తున్న ఎస్సై మృత్యుంజయ సర్కార్

జన్నారం: కారు ఢీకొని ఉపాధి కూలీ మృతిచెందిన ఘటన మండలంలోని రోటిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. రెండవ ఎస్సై మృత్యుంజయ సర్కార్, మృతుడి మనుమడు పానగంటి కిరణ్ తెలిపిన వివరాలు.. రోటిగూడకు చెందిన కందుల లచ్చన్న (68) శనివారం ఉదయం సమీప అటవీ ప్రాంతంలోని ఉపాధి హామీ పనికి వెళ్లాడు. తిరిగి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మహ్మదబాద్ సమీపంలో అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన లచ్చన్నను లక్సెట్టిపేట ఆస్పత్రికి అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదివారం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, ప్రమాదానికి కారణమైన కారు తిర్యాణి మండలం గిన్నెధరి గ్రామానికి చెందిన మడావి శ్రీనివాస్‌గా గుర్తించారు. మృతుడి మనుమడు కిరణ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తెకు వివాహమైంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సెకండ్ ఎస్సై రామయ్య

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన రాథోడ్ రాజేందర్(31) చికిత్స పొందుతు మృతి చెందాడు. స్థానిక ఎస్సై చంద్రకుమార్ కథనం ప్రకారం.. రాజేందర్‌కు జన్నారం మండల మొర్రిగూడకు చెందిన సుజాతతో 8 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈనెల 21న మొర్రిగూడలోని అమ్మవారి ఆలయంలో పూజకు వెళ్లగా భార్య తరపున కుటుంబీకులతో జరిగింది. తీవ్ర మనస్తాపం చెందిన ఆయన ఈనెల 25న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు గమనించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతు ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి నాందేవ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన చీపిరిశెట్టి గణేశ్ (23) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఏఎస్సై చాంద్‌పాషా కథనం ప్రకారం.. గణేశ్ శనివారం రాత్రి తన టాటాఏస్ ట్రాలీని కరెంట్ కట్టర్ మిషన్‌తో కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి తల్లి కొమురమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చేపల వలలో చిక్కుకుని ఒకరు..

ముల్కల శివారులోని ఓ మడుగులో చేపలు పట్టేందుకు వెళ్లి తను వేసిన వలలో చిక్కుకుని మగొర సబర్(31) మృతిచెందాడు. ఏఎస్సై చాంద్‌పాషా కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సబర్ మూడు నెలల క్రితం ముల్కల్ల శివారులోని ఇటుక బట్టీల్లో కూలీ పని చేసేందుకు వలస వచ్చాడు. శనివారం సాయంత్రం అక్కడే సమీపంలోని ఓ మడుగులో చేపలు పట్టేందుకు వల వేసి వచ్చాడు. తిరిగి రాత్రి మడుగు దగ్గరకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి తను వేసిన వలలో చిక్కుకుని మృతిచెందాడు. సోదరుడు చక్రధర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

భీమారం: మండలంలో వి ద్యుత్ కోతలు లేకుండా చ ర్యలు తీసున్నామని ఏఈ కుమార్ తెలిపారు. విద్యు త్తు కోతలతో దహన సంస్కారాలకు ఇక్కట్లు శీర్షికన 'సాక్షి'లో ఆది వారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వర్షాకాలం మెరుగైన విద్యుత్ అందించేందుకు కిష్టంపేట నుంచి మండల కేంద్రానికి వచ్చే 33 కేవీ విద్యుత్తు లైనుపై ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపట్టామన్నారు. ఈమేరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ముందస్తుగానే ప్రజలకు సమాచారం ఇచ్చామన్నారు. అనుకోకుండా గ్రామంలో మహిళ మరణించడంతో దహన సంస్కారాల కోసం బంధువులు, స్నేహితులు విద్యుత్ సరఫరా చేయాలని అడిగారని అన్నారు. ఆ సమయంలో సి బ్బంది విద్యుత్ స్తంభాలపై ఉండడంతో సి బ్బందికి సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా చేశామని తెలిపారు. అప్పటికే దహన సంస్కారాలు పూర్తి చేశారని పేర్కొన్నారు. అధికారికంగా ఎలాంటి కోతలు లేవని స్పష్టం చేశారు.

పేకాటస్థావరంపై దాడి

జైపూర్: మండలం నర్వ గ్రామంలో పేకాట స్థావరంపై ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం దాడి నిర్వహించారు. పక్కా సమాచారంతో దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.54,710 నగదుతోపాటు 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముగిసిన భగవద్గీత శిక్షణ



పారాయణంలో పాల్గొన్న చిన్నారులు

జన్నారం: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో చిన్నారులకు 30 రోజుల పాటు నిర్వహించిన భగవద్గీత శిక్షణ ఆదివారం ముగిసింది. పారాయణం చేసే విధంగా, శ్లోకం అర్థాలను వివరించారు. చివరి రోజు ప్రతిభ కనబర్చిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. బాసెట్టి సత్యవతి నెల రోజులపాటు చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వర్తక సంఘం నాయకులు జక్కు సత్తయ్య, గుండా సుధాకర్, పూజారి గణేశ్‌శర్మ, నాయకులు గంగాధర్, శంకరయ్య, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



సీతారాం (ఫైల్)

బెజ్జూర్: బైక్ అదుపు తప్పి ఒకరు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన ఇట్యాల సీతారాం(55) తన కుమారుడు అంజన్న కలిసి ఆదివారం రాత్రి బైక్‌పై మండలంలోని కృష్ణపల్లికి వెళ్తున్నారు. మాందూరి వెంకటేశ్ సైకిల్‌పై ఎదురెదురుగా వస్తుండగా బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో అంజన్న, సీతారామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సీతారాం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి

భైంసాటౌన్:పట్టణంలోని పార్డి(బి) బైపాస్‌రోడ్ ఎన్‌బి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కదం ప్రీతి(31) మృతి చెందారు. మండలంలోని మహాగాం ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తుండగా, రెండేళ్లుగా పట్టణంలోని పిప్రి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.ఈక్రమంలో ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా ఆదివారం మృతిచెందారు. దీంతో ఉపాధ్యాయవర్గాలు ఆమె మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

అ'పూర్వ' సమ్మేళనం



చెన్నూర్ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ 1975–77 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు 49 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఎస్‌ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నానాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్వర్గస్తులైన గురువులు, తోటి మిత్రులకు నివాళులర్పించారు. ఆనంతరం గురువులు పులి రామన్న, సాధిక్ అలీ, అదువాల లచ్చయ్య, రెవెల్లి రామయ్యను సన్మానించారు. బెల్లంకొండ మోహన్‌రావు, కరుణసాగర్ రావు, ఉప్పు వామన్‌రావు, సుసర్ల సురేశ్, అక్బర్‌తోపాటు 40 మంది పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ యూపీఎస్‌లో 1987–93వ సంవత్సరంలో 6 నుంచి 8 తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. స్థానిక కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అపూర్వ సమ్మేళనానికి హాజరై సందడి చేశారు. ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమెరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు రాజమల్లయ్య, నాగమల్లేశ్వర్, సుదల్సన, సువర్ణ, కుబ్జాదేవి, సునంద, నిర్వాహకులు రమేశ్, నళినికాంత్, సురేందర్, మల్లేశ్, జావిద్, గోపి, సుధాకర్ వినోద్ పాల్గొన్నారు.



క్రిష్ణకాలనీకి సరస్వతీ శిశుమందిర్‌కు చెందిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మంచిర్యాలలో

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సరస్వతీ శిశుమందిర్ పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు కట్ట వెంకటరెడ్డి, శంకరయ్య మిగతా విద్యార్థులను సన్మానించారు. జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. విద్యార్థులు ప్రభాకర్, ప్రశాంత గంగాధరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

24 ఏళ్ల తర్వాత..

కృష్ణకాలనీకి చెందిన సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఉపాధ్యాయులు 24 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చంద్రశేకర్, విజయలక్ష్మి పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు.



ఉపాధ్యాయులతో సరస్వతీ శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా గ్రామంలో విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన 3.25 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న విత్తనాలు, విక్రయిస్తున్న ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. పక్కా సమాచారంతోనే గత నాలుగు రోజుల క్రితం గూడెం ప్రాణహిత నది వద్ద నకిలీ విత్తనాలను తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. మండలంలోని గంగాపూర్‌కు చెందిన చాపిలె పురుషోత్తం, సిర్పూర్(టి) మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన బొల్లబోయిన అశోక్‌ను అదుపులో తీసుకుని విచారించారు. డబ్బా గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు భారీ మొత్తంలో ఉన్నట్టుగా తేలింది. గ్రామ శివారులో సోదాలు నిర్వహించగా భారీ మొత్తంలో పట్టుబడ్డాయి. పట్టుబడ్డ 3.25 క్వింటాళ్ల విత్తనాల విలువ సుమారు రూ.8.12 లక్షలు ఉంటుందని టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పురుషోత్తం, అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

విద్యుత్‌షాక్‌తో ఆవులు మృతి

తాంసి/తలమడుగు: తలమడుగు మండలం లింగి శివారు పొలంలో ఆదివారం రెండు ఆవులు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. మేత కోసం ఆవులు వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.50 వేల వరకు ఉంటుందని తాంసి మండలం గిరిగాం గ్రామానికి చెందిన బాధిత రైతులు విలాస్, జ్ఞానేశ్వర్ తెలిపారు. అధికారులు పరిహారం అందించాలని కోరారు.

సింగరేణి కార్మిక సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సింగరేణి కార్మికుల సమస్యలు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే పరిష్కరించేలా చూడాలని మావోయిస్టు పార్టీ సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన పత్రికలకు లేఖ విడుదల చేశారు. గత ప్రభుత్వాలు కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడిందని ఆరోపించారు. ఓపెన్‌కాస్ట్‌లు రద్దు చేస్తామని అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికే బీఆర్‌ఎస్‌ని కార్మికులు పాతర వేశారని గుర్తు చేశారు. శాశ్వత కార్మికుల సంఖ్య తగ్గిస్తూ కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెంచుతున్న యాజమాన్యం భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. కాంగ్రెస్ సింగరేణిని ప్రైవేటీకరించకుండా చర్యలు చేపట్టాలని, బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణ రద్దు చేయాలని, సింగరేణికి ప్రభుత్వం నుంచి రావల్సిన రూ.25 వేల కోట్లను విడుదల చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేసి రూ.25 లక్షల హెల్త్‌కార్డు ఇవ్వాలని కోరారు. కార్మికులకు సొంతింటి పథకం కింద 350 గజాల స్థలం, రూ. 25 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని పేర్కొన్నారు. సింగరేణిలో యూనివర్సిటీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, రిటైర్డ్ కార్మికులకు ఐదేళ్లకోసారి పింఛన్ 20 శాతం పెంచాలని, కార్మికులు మరణిస్తే రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.

సౌత్‌ఇండియా అదనపు ప్రధాన కార్యదర్శిగా రఘుపతిరావు

మంచిర్యాలఅర్బన్: హ్యూమన్‌రైట్ కౌన్సిల్ ఫర్ ఇండియా సౌత్ ఇండియా అదనపు ప్రధాన కార్యదర్శిగా రఘుపతిరావును నియమించిన ట్లు జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహారావు తెలిపారు. వి శాఖపట్నంలో ఆదివారం జరిగిన మహాసభలో ఆయనకు నియమాకపత్రం అందజేశారు. రా ష్ట్ర అధ్యక్షుడు తిరుమల్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజులు రఘుపతిరావును సన్మానించారు.